APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com

తెలుగువార్త

ప్రచురణ : శ్రీ సత్యసాయి / అనంతపురం ఎడిటర్ : సి హరికృష్ణ శుక్రవారం 05, జూన్ 2026 సంపుటి: 01 సంచిక : 09 పేజీలు : 04 వెల: 2-00/-




## రైతుల శిక్షణ కేంద్రం ప్రారంభం

- కేంద్రాన్ని ప్రారంభించిన నిర్మలా సీతారామన్
- వేరుశెనగ ఉత్పత్తులకు ప్రోత్సాహం
- యాదగిరి రైతులకు కొత్త అవకాశాలు

యాదగిరి, జూన్ 4 : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కర్ణాటక రాష్ట్రంలోని యాదగిరి జిల్లాలో బడేపల్లి గ్రామంలో రైతుల శిక్షణ, ఉమ్మడి సదుపాయాల కేంద్రాన్ని ప్రారంభించారు. రైతుల ఆదాయ వృద్ధి, విలువ ఆధారిత వ్యవసాయ ఉత్పత్తుల తయారీకి ఈ కేంద్రం ఉపయోగపడనుంది. సభ్యుల స్థానిక ప్రాంత అభివృద్ధి నిధి పథకం ఆధ్వర్యంలో, జాతీయ వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధి బ్యాంకు సహకారంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, శిక్షణ, ప్రాసెసింగ్ సదుపాయాలను అందించడమే దీని ప్రధాన లక్ష్యంగా అధికారులు తెలిపారు. వేరుశెనగ పంటను అధిక విలువ కలిగిన ఉత్పత్తులుగా మార్చే కేంద్రంగా ఇది పనిచేయనుంది. వేరుశెనగ నుంచి వివిధ రకాల విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసి మార్కెట్‌కు అందించే అవకాశాలు ఈ కేంద్రం ద్వారా లభించనున్నాయి. దీంతో రైతులకు మెరుగైన ఆదాయం సమకూరే అవకాశం ఉందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి ప్రాధాన్యం పెరుగుతోందన్నారు. రైతులు కేవలం పంట ఉత్పత్తికే పరిమితం కాకుండా ప్రాసెసింగ్, మార్కెటింగ్ రంగాల్లో కూడా ముందుకు రావాల్సిన అవసరం ఉందని సూచించారు.

## ప్రజా తీర్పుతో కొత్త అధ్యాయం



అమరావతి, జూన్ 4 : ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో చిరస్మరణీయమైన రోజుగా నిలిచిన 2024 జూన్ 4ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుర్తు చేసుకున్నారు. గత ఏడాది ఇదే రోజున వెలువడిన ఎన్నికల ఫలితాలతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడటానికి ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమాల వేదికగా ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. గత పాలనలో రాష్ట్రం అనేక సవాళ్లను ఎదుర్కొందని, అభివృద్ధి నిలిచిపోయిన పరిస్థితుల నుంచి తిరిగి పురోగతి దిశగా తీసుకెళ్లాలనే సంకల్పంతో ప్రజలు కూటమికి భారీ మద్దతు ఇచ్చారని చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణ బాధ్యతను ప్రజలు తమ భుజాలపై ఉంచారని, ఆ బాధ్యతను నెరవేర్చేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.

ప్రజలు తమకు అప్పగించింది కేవలం అధికారమేమీ కాదని, భవిష్యత్ తరాలకు మెరుగైన ఆంధ్రప్రదేశ్‌ను అందించే బాధ్యత అని చంద్రబాబు అన్నారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడం, ఉపాధి అవకాశాలను పెంచడం, పెట్టుబడులను ఆకర్షించడం, మౌలిక వసతులను అభివృద్ధి చేయడం వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని వివరించారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అనే మూడు ప్రధాన సూత్రాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పిస్తూ, ప్రాంతీయ అసమానతలను తొలగిస్తూ రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర అభివృద్ధి సాధించడమే లక్ష్యమన్నారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

రాష్ట్ర ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని చంద్రబాబు స్పష్టం చేశారు. ఆరోగ్య రంగం, విద్య, వ్యవసాయం, పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి కల్పన వంటి రంగాల్లో వేగవంతమైన పురోగతికి చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందించేందుకు ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ఇచ్చిన ప్రతి ఓటరికి, ప్రజలకు, పార్టీ శ్రేణులకు చంద్రబాబు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి ప్రయాణంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్‌ను ముందుకు తీసుకెళ్తామని ఆయన స్పష్టం చేశారు.



## ఢిల్లీ హోటల్ అగ్నిప్రమాదంలో హత్తుకుని ప్రాణాలు విడిచిన జంట

న్యూఢిల్లీ, జూన్ 4 : దేశ రాజధాని ఢిల్లీలోని మాల్వియా నగర్ ప్రాంతంలో జరిగిన ఘోర అగ్నిప్రమాదం హృదయ విదారక దృశ్యాలను మిగిల్చింది. ఫ్లరిష్ స్టే అనే వసతి గృహంలో చెలరేగిన మంటలు, దట్టమైన పొగ కారణంగా 21 మంది ప్రాణాలు కోల్పోగా, సహాయక చర్యల సమయంలో వెలుగులోకి వచ్చిన దృశ్యాలు అందరినీ కలచివేశాయి. సహాయక బృందాలు భవనంలోని గదులను తనిఖీ చేస్తున్న సమయంలో గ్రౌండ్ ఫ్లోర్‌లోని ఒక స్నానాల గది తలుపు లోపలి నుంచి బిగించి ఉండటాన్ని గుర్తించాయి. తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లగా ఒక జంట ఒకరినొకరు గట్టిగా హత్తుకుని ప్రాణాలు కోల్పోయిన స్థితిలో కనిపించింది. పొగ నుంచి రక్షించుకోవడానికి వారు స్నానాల గదిలోకి వెళ్లి తలుపు మూసుకుని ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. మరో గదిలో మంచంపై కూర్చున్న స్థితిలోనే మరో జంట కాలిన మృతదేహాలుగా కనిపించడంతో సహాయక సిబ్బంది దిగ్భ్రాంతికి గురయ్యారు.

## డీఎస్సీపై పేర్ని నాని విమర్శలు



మచిలీపట్నం, జూన్ 4 : డీఎస్సీ నియామకాలు, స్పోర్ట్స్ కోటా ఉద్యోగాల భర్తీ వ్యవహారాలపై వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పేర్ని నాని కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ అవగాహన సదస్సులో పాల్గొన్న ఆయన ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పేర్ని నాని మాట్లాడుతూ తనపై బియ్యం దొంగతనం ఆరోపణలు చేస్తున్నారని, నిజంగా ఆధారాలు ఉంటే విచారణ జరిపించి జైలుకు పంపాలని సవాల్ విసిరారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని పేర్కొంటూ, రాజకీయ కక్షసాధింపుతో ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. తమపై విమర్శలు చేయడం కాకుండా ప్రభుత్వం వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు.

స్పోర్ట్స్ కోటా నియామకాల విషయంలో ప్రభుత్వం అనేక ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సి ఉందని పేర్ని నాని అన్నారు. మొదట క్రీడా కోటాను మూడు శాతానికి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసి, అనంతరం వందలాది మందిని ఎంపిక చేసినట్లు ప్రకటించిందని గుర్తుచేశారు. అయితే ఎంపికైన అభ్యర్థుల పూర్తి జాబితాను ఇప్పటివరకు ఎందుకు బహిరంగపరచలేదని ప్రశ్నించారు. క్రీడల జాబితాలో మార్పులు చేయడం, కొత్త క్రీడలను చేర్చడం వెనుక ఉన్న కారణాలను ప్రభుత్వం వివరించాలని డిమాండ్ చేశారు. నియామక ప్రక్రియలో పారదర్శకత పాటించలేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ఎంపికల ప్రక్రియకు సంబంధించిన పత్రాలను ప్రజల ముందుంచాలని కోరారు.

డీఎస్సీ నియామకాల విషయంలో కూడా భారీ అక్రమాలు జరిగాయని పేర్ని నాని ఆరోపించారు. ఈ అంశంపై వస్తున్న విమర్శలకు ప్రభుత్వం సమాధానం చెప్పకుండా తప్పించుకుంటోందని అన్నారు. అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వకుండా ప్రభుత్వం విమర్శలకే పరిమితమవుతోందని ఆయన ఆరోపించారు. డీఎస్సీ, స్పోర్ట్స్ కోటా నియామకాలపై సమగ్ర వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో పారదర్శకత, జవాబుదారీతనం అత్యంత ముఖ్యమని పేర్ని నాని పేర్కొన్నారు. ఉద్యోగ నియామకాల విషయంలో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా ప్రభుత్వం వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు న్యాయం జరిగేలా అన్ని అంశాలపై స్పష్టత ఇవ్వాలని ఆయన కోరారు.

## ప్రజా ఆశీస్సులకు కృతజ్ఞతలు



- రెండేళ్ల విజయ ప్రయాణం
- ధర్మవరం ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు
- స్వర్ణాంధ్ర లక్ష్యంగా ముందుకు

ధర్మవరం, జూన్ 4 : రాష్ట్ర ప్రజలు ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి మద్దతుగా చారిత్రాత్మక తీర్పు ఇచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రెండేళ్ల క్రితం ఇదే రోజున ప్రజలు చూపిన ప్రేమ, విశ్వాసం, ఆశీర్వాదాలు తనకు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా ధర్మవరం నియోజకవర్గ ప్రజలు తనపై ఉంచిన నమ్మకానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజల ఆశలను నెరవేర్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని, వారి విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు చెప్పారు.

ప్రజాసేవే తన ధ్యేయమని పేర్కొన్న మంత్రి, ధర్మవరం అభివృద్ధి కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలు అందించిన ఆశీర్వాదాలకు రుణపడి ఉంటానని, వారి సంక్షేమం కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని సత్య కుమార్ యాదవ్ అన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు ప్రాధాన్యత ఇస్తూ ప్రతి కుటుంబానికి మేలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

# డా. జి. మురళీమోహన్ యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు







తిరుపతి: అను విద్యాసంస్థల అధినేత, కాంగ్రెస్ పార్టీ జాతీయ కోఆర్డినేటర్ డా. జి. మురళీమోహన్ యాదవ్‌ను తిరుపతిలో కలిసి కాంగ్రెస్ పార్టీ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నచ్చు బాలకృష్ణ యాదవ్ దుశ్శాలువతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నచ్చు బాలకృష్ణ యాదవ్ మాట్లాడుతూ, విద్యార్థి నాయకునిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన మురళీమోహన్ యాదవ్ గత రెండు దశాబ్దాలుగా బీసీల హక్కులు, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్నారని అన్నారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో డాక్టరేట్ పొందిన ఆయన, విద్యా రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్నారని కొనియాడారు. 2005లో అను విద్యాసంస్థలను స్థాపించి, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఫీజుల విషయంలో రాయితీలు కల్పించడమే కాకుండా, నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్యను కూడా అందిస్తూ విద్యా సేవలను విస్తృతంగా కొనసాగిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన మురళీమోహన్ యాదవ్ ప్రస్తుతం పార్టీ జాతీయ బీసీ కోఆర్డినేటర్‌గా, తమిళనాడు, పుదుచ్చేరి, అండమాన్-నికోబార్ దీవుల ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. డా. మురళీమోహన్ యాదవ్ మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకుంటూ ప్రజాసేవలో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షిస్తూ నచ్చు బాలకృష్ణ యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు.

# అమ్మ పేరుతో ఒక చెట్టు' కార్యక్రమం నిర్వహించిన బీజేపీ నాయకులు




ఒడిసి, జూన్ 5: జాతీయ పార్టీ, రాష్ట్ర అధ్యక్షుల ఆదేశాల మేరకు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒడిసి మండలంలో "అమ్మ పేరు మీద ఒక చెట్టు" కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 12 సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా జూన్ 5 నుంచి 18వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రైతులు, పేదలు, మహిళలు, యువత మరియు దేశ ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే లక్ష్యంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి శరత్ కుమార్ రెడ్డి, కౌలు రైతు రాష్ట్ర కో-కన్వీనర్ సోమగుట్ట హనుమంత్ రెడ్డి, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు ఇందుకూరి సురేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు వీరాంజనేయులు, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి హరి, కౌలు రైతుల మండల కన్వీనర్ ఆశాది జగదీష్, బీజేపీ నాయకుడు నాగప్ప, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ నిరసనలపై ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం



అనంతపురం, జూన్ 04 అనంత సూర్య న్యూస్ : జూన్ 4 అంటే రాష్ట్ర ప్రజలు గొడ్డలి పార్టీకి చరమగీతం పాడిన రోజు అని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రాష్ట్రంలో వైసీపీ చేపట్టిన వెన్నుపోటుకు రెండేళ్ల కార్యక్రమంపై ఆమె తీవ్ర సా-ధ్యిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రామగిరి మండలం వెంకటాపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆమె పార్టీ నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో జూన్ 4, 2024 చిరస్థాయిగా నిలిచిపోయే రోజు అని సునీత అన్నారు. విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రాన్ని నడిపించేలా మరోసారి చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిని చేశారన్నారు. వైసీపీ విధ్వంసానికి ముగింపు పలికి, అభివృద్ధి యుగానికి నాంది పలికేలా కూటమి విజయం సాధించిన ఈ రోజు మరపురానిదన్నారు. గెలిచిన రోజు నుంచి ప్రజలకిచ్చిన హామీలు నెరవేరుస్తూ.. రాష్ట్రాన్ని విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నారన్నారు. ఇప్పటికే కీలకమైన హామీలన్నీ నెరవేర్చామని.. రాష్ట్రంలో ప్రజలంతా సంతోషంగా ఉండటం చూసి వైసీపీ నాయకులు తట్టుకోలేక నిరసనలు తెలియజేస్తున్నారన్నారు. వారి నిరసన కార్యక్రమాలు చూసి ప్రజలే నవ్వుకుంటున్నారన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో జరిగిన విధ్వంసం ఒక ఎత్తైతే రాప్తాడు నియోజకవర్గంలో ఇంకో రకంగా జరిగిందన్నారు. రాప్తాడు ప్రాంతంలోని మహిళలకు, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలని జాకీ పరిశ్రమ తీసుకొస్తే.. కేవలం తమకు కమీషన్ ఇవ్వలేదన్న ఉద్దేశ్యంతో ఆ పరిశ్రమను వెళ్లగొట్టారన్నారు. ఆ విధంగా ఎంతో మంది మహిళలకు అన్యాయం చేశారన్నారు. అక్కడితో ఆగకుండా డ్వాక్రా మహిళల నుంచి కోట్ల రూపా-యలు వసూళ్లు చేసి అమ్మ డైరీ పేరుతో మరో దోపిడీ చేశారన్నారు. పేదలకు ఇళ్లు కట్టిస్తామని నమ్మబలికి.. రాక్రీట్ సంస్థ ద్వారా అమాయక ప్రజల నుంచి డబ్బు వసూళ్లు చేశారన్నారు. ప్రభుత్వ సొమ్మును దోపిడీ చేశారన్నారు. ఇవే కాకుండా పేరూరు ప్రాజెక్టుకు నీరందించే పనులను గత టీడీపీ ప్రభుత్వంలో తాము మొదలు పెడితే.. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఒక్క గంపెడు మట్టి కూడా తీయకుండా కాలం గడిపారన్నారు. కనీసం భూములిచ్చిన రైతులకు పరిహారం కూడా ఇవ్వలేదన్నారు. ఇవే కాకుండా నియోజకవర్గ వ్యాప్తంగా భూదోపిడీలు, అక్రమాలు, దౌర్జన్యాలు సాగించారన్నారు. ఈ రెండేళ్లలోనే జాకీ స్థానంలో రేమాండ్స్ పరిశ్రమ తీసుకొచ్చామని, పేరూరు ప్రాజెక్టు పనులు మళ్లీ ప్రారంభించామన్నారు. భూఅక్రమాలకు తావు లేకుండా చేశామన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు సాగుతున్నాయన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు ఇలాంటివి మానుకోవాలని ఎమ్మెల్యే సునీత హితవు పలికారు...

### ప్రతి ఒక్కరూ సైకిల్ తొక్కండి..
### ఎమ్మెల్యే సునీత పిలుపు

పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం రోజు ప్రతి ఒక్కరూ సైకిల్ వినియోగించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలుగుదేశం పార్టీ శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఒక ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన నేపథ్యంలో ఆమె పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అనే సందేశాన్ని సమాజానికి చాటిచెప్పేందుకు రేపు ఒక్కరోజు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సాధ్యమైనంత వరకు సైకిళ్లను వినియోగించాలని ఆమె సూచించారు. ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని సైకిళ్లు వాడాలన్నారు. సైకిల్ వినియోగం వల్ల కాలుష్యం తగ్గుతుంది. ఇంధన వినియోగం తగ్గుతుంది. ఆరోగ్యం మెరుగుపడుతుందని.. ప్రకృతికి మేలు జరుగుతుందన్నారు. పశ్చిమాసియా దేశాల యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో తలెత్తిన ఇంధన సంక్షోభం నుంచి గట్టెక్కడానికి ఈ కార్యక్రమం ఒక ఊతంలా నిలుస్తుందన్నారు. ఇప్పటికే మహానాడు కార్యక్రమాన్ని వర్చువల్ ద్వారా నిర్వహించి ఇంధన పొదుపు చేశ-ామన్నారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో మరో కార్యక్రమానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో దీనిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మరోవైపు వెంకటాపురం గ్రామానికి చెందిన నసనకోట వడ్డి ముత్యాలప్ప తీవ్ర అనారోగ్యంతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయంపై ఎమ్మెల్యే సునీత స్పందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన ముత్యాలప్ప వైద్యం కోసం రూ.4లక్షలు ఎల్‌ఓసి ద్వారా సాయం అందించారు. ఈ ఎల్‌ఓసీ పత్రాన్ని వెంకటాపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ముత్యాలప్ప కుటుంబసభ్యులకు అందజేశారు..

# అమ్మ పేరుతో ఒక మొక్క...

## పర్యావరణ పరిరక్షణకు కిసాన్ మోర్చా పిలుపు



నూజివీడు, జూన్ 5: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పుర-స్కరించుకుని బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో "పే ఏక్ పేడ్ మా కె నామ్ -- అమ్మ పేరుతో ఒక మొక్క" కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు జూన్ 5 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించే పలు కార్యక్రమాల్లో భాగంగా ఈ మొక్కల నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు. కిసాన్ మోర్చా ఏలూరు జిల్లా అధ్యక్షుడు కీర్తి వెంకట్ రామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో నూజివీడు నియోజకవర్గంలోని నగరవరం--బత్తలవారిగూడెంలో ఉదయం 9 గంటలకు కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రతి కార్యకర్త తమ తల్లి పేరు మీద ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. సొంత భూముల్లో, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, దేవాలయాల ప్రాంగణాల్లో అనుమతితో మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ చిగురుపాటి కుమారస్వామి, బీజేపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు శ్రీ చౌటుపల్లి విక్రమ్ కిషోర్, కిసాన్ మోర్చా ఏలూరు జిల్లా అధ్యక్షుడు శ్రీ కీర్తి వెంకట్ రామ్ ప్రసాద్, బీజేపీ ఏలూరు జిల్లా పార్లమెంటరీ పార్టీ కన్వీనర్ శ్రీ కట్నేని కృష్ణ ప్రసాద్, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి శ్రీ దొడ్డ నాగరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీ ఉండవల్లి వెంకట్రావు, శ్రీమతి అడపా శోభారాణి తదితరులు హాజరుకానున్నారు. కిసాన్ మోర్చా కుటుంబ సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శులు మేకల శ్రీకృష్ణదేవరాయలు, సింగం కృష్ణ ప్రసాద్ కోరారు.

# టిడిపి తోనే నిరుద్యోగ నిర్మూలన...

అనంతపురం, జూన్ 04 అనంత సూర్య న్యూస్ : తెలుగుదేశం పార్టీ 1983 నుంచి ఇప్పటివరకు అధికారులు ఉన్నప్పుడు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు 60 శాతం కల్పించిన ఘనత టిడిపికి దక్కుతుందని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి అమర్ యాదవ్ అన్నారు. అనంతనగరంలో విద్యార్థి జేఏసీ కార్యాలయంలో విలేకరు సమావేశంలో అమర్ యాదవ్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారిలో కాంటాక్ట్, ఔట్సోర్సింగ్ ప్రభుత్వ ఉద్యోగాలలో టిడిపి అధికారంలో ఉన్నప్పుడు



ఇచ్చినవేనని గుర్తు చేశారు. 2004లో రాజశేఖర్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగాలు అమ్ముకున్నారని ఆరోపించారు. 2019లో జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్లపాటు అహంకారం తలకెక్కి, చట్టాలను చుట్టాలుగా మార్పు చేసుకొని వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. గత ఐదేళ్లలో ఎంతమందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చారు శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. ప్రస్తుతం ప్రభుత్వంలో ఉద్యోగాలు నోటిఫికేషన్లు జారీ చేస్తే దాన్ని అడ్డుకునే ప్రయత్నం జరుగుతుందన్నారు. నవ్యాంధ్ర రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాలు రాక వాళ్లకు పెళ్లిళ్లు గాక బాధపడుతుంటే టిడిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేసి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే,

జగన్ తాము అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వంలో ఇచ్చిన ఉద్యోగాలనాన్ని రద్దు చేస్తాం అనడం దేనికి సంకేతం జగన్ చెప్పాలన్నారు. ఇప్పటికైనా జగన్ మానసిక మారాలన్నారు.

# ఉపరితల ఆవర్తనంతో వర్షాల హెచ్చరిక



అమరావతి, జూన్ 4 : రాష్ట్రంలో ఉపరితల ఆవర్తనం ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో శుక్రవారం పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ముఖ్యంగా తీరప్రాంతం, మధ్య ఆంధ్ర జిల్లాల్లో పిడుగులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడే సూచనలు ఉన్నాయని అధికారులు తెలిపారు. పోలవరం, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. కొన్ని ప్రాంతాల్లో ఉర-ుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురు గాలులు కూడా వీచే అవకాశముందని హెచ్చరించింది.

# ఈపీఎఫ్ వడ్డీ కోసం ఎదురుచూపులు



న్యూఢిల్లీ, జూన్ 4 : ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ఈ ఆర్థిక సంవత్సరానికి ఉద్యోగుల భవిష్య నిధి ఖాతాలపై 8.25 శాతం వడ్డీ రేటును యథాతథంగా కొనసాగించినప్పటికీ, ఖాతాల్లో వడ్డీ జమ కాకపోవడంతో లక్షలాది మంది చందాదారులు ఎదురుచూస్తున్నారు. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడిచినా వడ్డీ జమ కాకపోవడంతో పలువురిలో ఆందోళన వ్యక్తమవుతోంది.

మార్చి నెలలో జరిగిన కేంద్ర ట్రస్టీ బోర్డు సమావేశంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి కూడా 8.25 శాతం వడ్డీ రేటును కొనసాగించాలని నిర్ణయించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ ఆమోదం వచ్చిన తర్వాతే ఈ వడ్డీ మొత్తాన్ని సభ్యుల ఖాతాల్లో జమ చేస్తారు.

నిపుణుల అభిప్రాయం ప్రకారం వడ్డీ జమలో జాప్యం సాధారణమే. ప్రభుత్వ అనుమతులు, ఖాతాల సయోధ్య, కోట్లాది సభ్యుల రికార్డుల నవీకరణ వంటి ప్రక్రియలు పూర్తయ్యేందుకు కొంత సమయం పడుతుంది. అందువల్ల వడ్డీ ఆలస్యంగా జమ అయినప్పటికీ సభ్యులకు రావాల్సిన మొత్తం వడ్డీపై ఎలాంటి ప్రభావం ఉండదని చెబుతున్నారు.

గత ఏడాది చాలా మంది సభ్యుల ఖాతాల్లో జూన్, జూలై నెలల్లో వడ్డీ జమ అయింది. అంతకుముందు సంవత్సరాల్లో సెప్టెంబర్, అక్టోబర్ వరకు ఆలస్యం జరిగేది. ప్రస్తుతం ప్రక్రియ వేగవంతం కావడంతో ఈసారి కూడా జూన్ లేదా జూలైలో వడ్డీ జమయ్యే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.

వడ్డీ జమ అయిందో లేదో తెలుసుకోవడానికి సభ్యులు తమ పాస్‌బుక్‌ను పరిశీలించవచ్చు. పాస్‌బుక్‌లో మార్చి 31, 2026 వరకు వడ్డీ నవీకరించబడినట్లు నమోదు కనిపిస్తే వడ్డీ జమ అయినట్లే. నమోదు కనిపించడంలో ఆలస్యం జరిగినా సభ్యుల వడ్డీ మొత్తానికి ఎలాంటి నష్టం ఉండదు.

ఈపీఎఫ్ బ్యాలెన్స్‌ను తెలుసుకునే మార్గాలు

ఉమాంగ్ యాప్ ద్వారా, ఈపీఎఫ్ సభ్యుల సేవా పోర్టల్‌లో లాగిన్ అయి, మిస్డ్ కాల్ సేవ లేదా సందేశ సేవ ద్వారా ఖాతా వివరాలు తెలుసుకోవచ్చు.

మిస్డ్ కాల్ ద్వారా

యూనివర్సల్ అకౌంట్ నంబర్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్ నుంచి 9966044425కు మిస్డ్ కాల్ ఇస్తే ఖాతా వివరాలు సందేశ రూపంలో అందుతాయి.

సందేశం ద్వారా

యూనివర్సల్ అకౌంట్ నంబర్ నమోదు చేసిన మొబైల్ నుంచి 7738299899 నంబర్‌కు సందేశం పంపి కూడా ఖాతా వివరాలు పొందవచ్చు.

చందాదారులు తమ ఆధార్, పాన్, బ్యాంకు ఖాతా వివరాలు యూనివర్సల్ అకౌంట్ నంబర్‌కు అనుసంధానమై ఉన్నాయో లేదో ఒకసారి నిర్ధారించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వడ్డీ జమ ప్రక్రియ పూర్తయిన వెంటనే సభ్యుల ఖాతాల్లో సంబంధిత మొత్తం ప్రతిబింబించనుంది.



# జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ 2వ సమావేశంలో 97 అక్రిడిటేషన్ లు మంజూరు



అనంతపురం, జూన్ 04 అనంత సూర్య న్యూస్ : జిల్లాలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేయడం జరుగుతుందని కలెక్టర్ మరియు జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ ఓ.ఆనంద్ స్పష్టం చేశారు. గురువారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ మీటింగ్ హాల్లో ఐ.అండ్.పీఆర్ (జిల్లా సమాచార మరియు పౌర సంబంధాల శాఖ) ఆధ్వర్యంలో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ 2వ సమావేశాన్ని కలెక్టర్ మరియు జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ ఓ.ఆనంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ నియమ నిబంధనలను అనుసరించి అర్హత కలిగిన ప్రతి ఒక్క జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ మంజూరు చేసిన అక్రిడిటేషన్ కార్డులలో నిబంధనల ప్రకారం ఏవైనా అభ్యంతరాలు ఉంటే సభ్యులు కమిటీ దృష్టికి తీసుకురావడం చేయాలని, దానిపై విచారించి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ మీటింగ్ కు 5 రోజుల ముందు ప్రిపరేటరీ మీటింగ్ ను సభ్యులతో నిర్వహించాలని ఐ.అండ్.పీఆర్ డిఐపిఆర్ఓ మరియు డిఎంఏసి మెంబర్ కన్వీనర్ కు సూచించారు. అక్రిడిటేషన్ కొనసాగాలంటే పేపర్ల రెగ్యులారిటీ ఖచ్చితంగా ఉండాలని, లేకపోతే తొలగించాలని కమిటీ నిర్ణయించింది. ఈ సమావేశంలో జిల్లాలో రెండవ విడతగా 97 అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేయడం జరిగింది. ఇందులోభాగంగా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ మానవతా దృక్పథంతో ఆలోచించి అర్హత కలిగిన వారికి అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని కోరగా, క్రమం తప్పకుండా పత్రికలు, పీరియాడికల్స్ డిఐపిఆర్ఓ కార్యాలయానికి అందచేయాలని, నిజాయితీగా ఉండే వాళ్లకి, ఎలాంటి తప్పులు చేయని వారికి నిబంధనల ప్రకారం అక్రిడిటేషన్లను మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఐ.అండ్.పీఆర్ డిఐపిఆర్ఓ మరియు డిఎంఏసి మెంబర్ కన్వీనర్ ఏ.బాలకొండయ్య, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు ఎస్.మహమ్మద్ అయుఫ్, ఏ.షఫీఉల్లా, సి.రవికుమార్, సి.ప్రతాప్, కె.అనిల్ కుమార్ రెడ్డి, కె.మల్లికార్జునరావు, ఎస్ఎండి.రసూల్, ఆర్.రామంజినేయులు, ఆర్వీఎస్.ప్రసాద్, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, లేబర్ కార్యాలయం ఏసీఎల్ లావణ్య, గృహ నిర్మాణ శాఖ అధికారి, ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం శ్రీలక్ష్మి, ఐ.అండ్.పీఆర్ ఏపీఆర్ఓ ఫక్రుద్దీన్, పిఆర్ఓ వి.సూర్యనారాయణ రెడ్డి, టైపిస్ట్ దామోదర్ రెడ్డి, టెక్నీషియన్ కమల్ పాల్గొన్నారు.

# అనంతపురంలో 'వెన్నుపోటుకు రెండేళ్లు' నిరసన
## టీడీపీ మేనిఫెస్టో, హామీ పత్రాల దహనం



అనంతపురం, జూన్ 4 అనంత సూర్య న్యూస్ : అనంతపురంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో 'వెన్నుపోటుకు రెండేళ్లు' నిరసనకూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలులో సీఎం చంద్రబాబు విఫలమయ్యారని మండిపాటుసూపర్ సిక్స్ హామీలను పూర్తిగా అమలు చేయకుండా ప్రచార ఆర్భాటం చేసుకోవడంపై నిలదీత

టీడీపీ మేనిఫెస్టోతో పాటు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ పేరుతో ఇచ్చిన హామీల బాండ్లను దహనం చేసిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలుకూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గరల్లోనే ఉన్నాయని వైఎస్ఆర్‌సీపీ నేతల హెచ్చరిక

అనంత వెంకటరామిరెడ్డి కామెంట్స్


రాష్ట్రంలో రెండేళ్లుగా 'వెన్నుపోటు పాలన' సాగుతోంది.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు అమలు చేసిన సంక్షేమ పథకాలకు కూటమి అధికారంలోకి వచ్చాక 'చంద్ర గ్రహణం' పట్టుకుంది. కూటమి పార్టీలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు రెండేళ్లయినా హామీలుగానే మిగిలిపోయాయి.

యువతకు ఉద్యోగాలు లేవు.. రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇవ్వలేదు. ఆడబిడ్డ నిధి కింద ప్రతి నెలా రూ.1500 ఇస్తామని వెన్నుపోటు పొడిచారు విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.4 వేల కోట్లు ఉన్నాయి. కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మహిళలకు, రైతులకు సున్నా వడ్డీ అందించకుండా చంద్రబాబు మోసం చేశారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేసిందేమీ లేదు. కేవలం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. సీఎం చంద్రబాబు ఫ్రస్టేషన్‌లోకి వెళ్లి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని వ్యక్తిగతంగా విమర్శలు చేస్తున్నారు. కూటమి పాలనను రెండు మాటల్లో చెప్పాలంటే.. అవినీతి--అక్రమాలు.. దందాలు--దౌర్జన్యాలు.. కుట్రలు--కుతంత్రాలే..!

సంక్షేమ పథకాలకు కోతలు పెట్టి అప్పుల మోత మోగిస్తున్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలన్నీ కలిసికట్టుగా ప్రజలను మోసం చేశాయి. ప్రజల తరఫున వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాటాలు కొనసాగిస్తుంది

# జేఈఈ అడ్వాన్స్‌డ్ - 2026లో ఆల్ ఇండియా 15వ ర్యాంక్ సాధించిన విశ్వం పూర్వ విద్యార్థి హర్షిత్‌కు ఘన సన్మానం



తిరుపతి, జూన్ 4 అనంత సూర్య న్యూస్ : దేశవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ - 2026 పరీక్షలో తిరుపతికి చెందిన విశ్వం విద్యాసంస్థల పూర్వ విద్యార్థి వెల్దుర్తి హర్షిత్ అఖిల భారత స్థాయిలో 15వ ర్యాంక్ సాధించి అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. ఈ అద్భుత విజయంతో తిరుపతి నగరంతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచాడు. ఈ సందర్భంగా కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్. విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ.. హర్షిత్ విశ్వం విద్యాసంస్థల్లో విద్యా భ్యాసంతో 2019లో నిర్వహించిన సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 3వ ర్యాంక్ సాధించారు అని,అలాగే 2019లో నిర్వహించిన రాష్ట్రీయ మిలిటరీ స్కూల్ ప్రవేశ పరీక్షలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఎంపికైన ఏకైక విద్యార్థిగా హర్షిత్ నిలవడం అతని అసాధారణ ప్రతిభకు నిదర్శనమని పేర్కొన్నారు.విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదల, తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం వల్లే ఈ గొప్ప విజయం సాధ్యమైందనన్నారు.

ఈ సందర్భంగా విశ్వం విద్యాసంస్థల కరస్పాండెంట్ తులసి విశ్వనాథ్, డైరెక్టర్ విశ్వచందన్ రెడ్డి, విశ్వశ్రీలు హర్షిత్‌ను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. హర్షిత్ తల్లి డాక్టర్ గిరిజాను కూడా ప్రత్యేకంగా సత్కరించి, కుమారుడి విజయానికి ఆమె అందించిన ప్రోత్సాహం, త్యాగాలను కొనియాడారు.విశ్వం విద్యాసంస్థల నుండి దేశ అత్యున్నత విద్యాసంస్థల్లో ప్రవేశాలు సాధిస్తున్న విద్యార్థుల సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతుండడం గర్వకారణమని సంస్థ ప్రతినిధులు తెలిపారు. భవిష్యత్తులో హర్షిత్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.జేఈఈ అడ్వాన్స్‌డ్ - 2026లో ఆల్ ఇండియా 15వ ర్యాంక్ సాధించిన హర్షిత్ విజయం విశ్వం విద్యాసంస్థల విద్యా ప్రామాణికతకు, నాణ్యమైన శిక్షణకు నిదర్శనంగా నిలిచిందని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు.సైనిక్ స్కూల్, నవోదయ విద్యాలయాలు మరియు రాష్ట్రీయ మిలిటరీ స్కూల్ ప్రవేశ పరీక్షలకు సంబంధించి మరింత సమాచారం కోసం 86888 88802, 93999 76999 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

# క్రెడిట్ కార్డు వాడేటప్పుడు ఈ జాగ్రత్తలు తప్పనిసరి



న్యూఢిల్లీ, జూన్ 4 : డిజిటల్ చెల్లింపుల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో క్రెడిట్ కార్డుల వాడకం కూడా గణనీయంగా పెరిగింది. చిన్న మొత్తాల నుంచి పెద్ద మొత్తాల కొనుగోళ్ల వరకు చాలామంది క్రెడిట్ కార్డులను ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా యూపీఐతో అనుసంధానం చేసిన కార్డుల ద్వారా చెల్లింపులు మరింత సులభమయ్యాయి. అయితే కొన్ని సందర్భాల్లో క్రెడిట్ కార్డు వినియోగం ఆర్థిక భారాన్ని పెంచే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఏటీఎంల నుంచి నగదు ఉపసంహరణకు దూరంగా ఉండాలి

క్రెడిట్ కార్డు ద్వారా ఏటీఎంలలో నగదు తీసుకునే సౌకర్యం ఉన్నప్పటికీ, అత్యవసర పరిస్థితుల్లో తప్ప దీనిని ఉపయోగించకపోవడమే మంచిదని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. నగదు ఉపసంహరించిన రోజు నుంచే వడ్డీ లెక్కింపు ప్రారంభమవుతుంది. దీనితో పాటు లావాదేవీ రుసుములు కూడా విధిస్తారు. ఫలితంగా చిన్న మొత్తాన్ని తీసుకున్నా అధిక వ్యయం భరించాల్సి వస్తుంది.

రోజువారీ ఖర్చులకు జాగ్రత్త

కిరాణా, ఆహారం, గృహ అవసరాలు వంటి రోజువారీ ఖర్చులకు తరచూ క్రెడిట్ కార్డు ఉపయోగించడం వల్ల నెలవారీ బడ్జెట్‌పై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. ఖర్చులపై నియంత్రణ కోల్పోయే ప్రమాదం కూడా ఉంటుంది. ఇటువంటి చెల్లింపులకు డెబిట్ కార్డు లేదా నగదు ఉపయోగించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

విదేశీ లావాదేవీల్లో అదనపు భారం

విదేశీ పర్యటనల సమయంలో క్రెడిట్ కార్డు వినియోగిస్తే విదేశీ కరెన్సీ మార్పిడి రుసుములు, అంతర్జాతీయ లావాదేవీ ఛార్జీలు, ఇతర సేవా రుసుములు విధించే అవకాశం ఉంటుంది. దీంతో మొత్తం ఖర్చు పెరుగుతుంది. ఈ పరిస్థితుల్లో ప్రీపెయిడ్ ట్రావెల్ కార్డులు లేదా ప్రత్యేక అంతర్జాతీయ కార్డులు ఉపయోగించడం ప్రయోజనకరంగా ఉంటుంది.

బిల్లు చెల్లించే సామర్థ్యం లేకపోతే వినియోగం తగ్గించాలి

గడువులోపు బిల్లు చెల్లించలేని పరిస్థితి ఉంటే క్రెడిట్ కార్డు వినియోగాన్ని తగ్గించడం మంచిది. ఆలస్య చెల్లింపులపై జరిమానాలతో పాటు అధిక వడ్డీ విధించబడుతుంది. కనీస బకాయి మాత్రమే చెల్లించినా మిగిలిన మొత్తంపై వడ్డీ కొనసాగుతుంది. ఇది క్రమంగా అప్పుల భారాన్ని పెంచే ప్రమాదం ఉంది.

ఖర్చులపై నియంత్రణే ఉత్తమ మార్గం

క్రెడిట్ కార్డు సరైన విధంగా ఉపయోగిస్తే ఆర్థిక నిర్వహణకు ఉపయోగపడుతుంది. అయితే అవసరానికి మించి వినియోగించడం, బిల్లులు సకాలంలో చెల్లించకపోవడం వల్ల అదనపు ఆర్థిక భారం పడే అవకాశం ఉంది. అందువల్ల ఖర్చులపై నియంత్రణ పాటిస్తూ, చెల్లింపు సామర్థ్యానికి అనుగుణంగా మాత్రమే క్రెడిట్ కార్డులను వినియోగించాలని నిపుణులు సూచిస్తున్నారు.

# తారక్‌తోనే బెస్ట్ కెమిస్ట్రీ.. ఇలియానా వ్యాఖ్యలు వైరల్



హైదరాబాద్, జూన్ 3 (అనంత సూర్య న్యూస్): ఒకప్పుడు టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వెలుగొందిన ఇలియానా డి క్రూజ్ మరోసారి వార్తల్లో నిలిచారు. ప్రస్తుతం కుటుంబ జీవితాన్ని ఆస్వాదిస్తున్న ఆమె గతంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో మళ్లీ వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా ఎన్.టి. రామారావు జూనియర్ గురించి ఆమె చేసిన కామెంట్స్ నందమూరి అభిమానులను ఆనందంలో ముంచెత్తుతున్నాయి.

తెలుగు సినీ పరిశ్రమలో మహేష్ బాబు, ప్రభాస్, రామ్, తారక్ వంటి అగ్ర హీరోలతో కలిసి నటించిన ఇలియానా, ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. “మీరు నటించిన హీరోల్లో ఎవరితో మీ స్క్రీన్ కెమిస్ట్రీ బాగా వర్కవుట్ అయింది?” అని యాంకర్ ప్రశ్నించగా, కాసేపు ఆలోచించిన ఇలియానా “తారక్‌తోనే నా స్క్రీన్ కెమిస్ట్రీ బెస్ట్” అని చెప్పడం విశేషం.

ఇలియానా, తారక్ కాంబినేషన్‌లో వచ్చిన రాఖీ, శక్తి చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ‘రాఖీ’ సినిమాలో వీరిద్దరి మధ్య సాగే ప్రేమకథ, పాటలు మంచి ఆదరణ పొందాయి. తారక్ ఎనర్జీకి తగ్గట్టుగా ఇలియానా చేసిన డ్యాన్స్ ప్రదర్శనలు కూడా అప్పట్లో విశేషంగా ఆకట్టుకున్నాయి.

అయితే ఇలియానా కెరీర్‌లో పోకిరి, మున్నా, దేవదాసు వంటి భారీ విజయాలు ఉన్నప్పటికీ, నటన పరంగా మరియు స్క్రీన్‌పై అనుబంధం పరంగా తారక్‌తో ప్రత్యేకమైన కెమిస్ట్రీ ఉందని ఆమె అభిప్రాయపడినట్లు అభిమానులు భావిస్తున్నారు.

ఇలియానా చేసిన ఈ వ్యాఖ్యలు పాతవే అయినప్పటికీ, ప్రస్తుతం తారక్ గ్లోబల్ స్థాయిలో గుర్తింపు పొందుతున్న నేపథ్యంలో ఈ వీడియోను అభిమానులు పెద్ద ఎత్తున సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. “తారక్‌తో ఇలియానా జోడీ ఎప్పటికీ ప్రత్యేకమే” అంటూ నందమూరి అభిమానులు కామెంట్లు చేస్తున్నారు.

ఇదిలా ఉంటే, వివాహం అనంతరం సినిమాలకు దూరంగా ఉన్న ఇలియానా ప్రస్తుతం తన ఇద్దరు కుమారులతో కుటుంబ జీవితాన్ని ఆస్వాదిస్తూ సోషల్ మీడియాలో అభిమానులతో టచ్‌లో ఉంటున్నారు.

# వైస్ కెప్టెన్ రేసులో తిలక్



హైదరాబాద్, జూన్ 4 : భారత యువ క్రికెటర్, హైదరాబాద్‌కు చెందిన ఎడమచేతి బ్యాటర్ తిలక్ వర్మ ప్రస్తుతం టీమిండియా టీ20 జట్టులో అత్యంత విశ్వసనీయ ఆటగాళ్లలో ఒకరిగా ఎదుగుతున్నాడు. క్లిష్ట పరిస్థితుల్లో క్రీజులో నిలబడి ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టే సామర్థ్యంతో ఈ 23 ఏళ్ల యువ బ్యాటర్ ప్రత్యేక గుర్తింపు సంపాదించాడు. దక్షిణాఫ్రికా గడ్డపై భారత్ సాధించిన చారిత్రాత్మక టీ20 సిరీస్ విజయాల్లోనూ, ఆసియా స్థాయి టోర్నీల్లోనూ అతని ప్రదర్శనలు అభిమానులను ఆకట్టుకున్నాయి.

ప్రస్తుతం భారత టీ20 జట్టు నాయకత్వంలో మార్పులు జరిగే అవకాశాలపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో తిలక్ వర్మ పేరు వైస్ కెప్టెన్సీ రేసులో ప్రముఖంగా వినిపిస్తోంది. ప్రస్తుత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొన్న తరుణంలో యువ ఆటగాళ్లకు అవకాశాలు కల్పించే దిశగా ఎంపిక కమిటీ ఆలోచిస్తున్నట్లు క్రీడా వర్గాల్లో ప్రచారం సాగుతోంది.

తిలక్ వర్మ ఇప్పటివరకు భారత సీనియర్ జట్టుకు అధికారికంగా నాయకత్వం వహించకపోయినా, ఇండియా--ఎ జట్టుకు కెప్టెన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. యువ ఆటగాళ్లతో కూడిన జట్టును సమర్థంగా నడిపిస్తూ కీలక విజయాలు అందించాడు. అతని నాయకత్వంలో ఇండియా--ఎ జట్టు అనేక కీలక మ్యాచ్‌ల్లో విజయాలు నమోదు చేసి మంచి ప్రదర్శన కనబరిచింది.

కెప్టెన్సీతో పాటు బ్యాటర్‌గా కూడా తిలక్ వర్మ అద్భుతమైన రికార్డులు నమోదు చేస్తున్నాడు. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో అతని సగటు, స్ట్రైక్‌రేట్ రెండూ ఆకట్టుకునే స్థాయిలో ఉన్నాయి. ఒత్తిడి పరిస్థితుల్లోనూ వేగంగా పరుగులు సాధించే సామర్థ్యం అతడిని జట్టుకు కీలక ఆటగాడిగా మార్చింది. యువకుడైనప్పటికీ పరిపక్వతతో కూడిన ఆటతీరు కనబరుస్తుండటం ఎంపికదారుల దృష్టిని ఆకర్షిస్తోంది.

భారత జట్టు భవిష్యత్ ప్రణాళికల్లో యువ నాయకత్వానికి ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో తిలక్ వర్మకు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలపై చర్చ జరుగుతోంది. అయితే వైస్ కెప్టెన్‌గా లేదా నాయకత్వ బృందంలో చోటు కల్పించే అంశంపై భారత క్రికెట్ నియంత్రణ మండలి నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ, బ్యాటర్‌గా నిలకడైన ప్రదర్శనలు, ఇండియా--ఎ జట్టుతో సాధించిన నాయకత్వ అనుభవం, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుంటే తిలక్ వర్మ పేరు ముందువరుసలో ఉండటం సహజమేనని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తెలుగు రాష్ట్రాల అభిమానులు కూడా ఈ యువ క్రికెటర్‌కు త్వరలోనే జాతీయ జట్టులో మరింత కీలక బాధ్యతలు దక్కాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఫ్లెక్స్ ఫ్యూయల్ బైక్‌లతో కొత్త దిశగా ఆటో రంగం

న్యూఢిల్లీ, జూన్ 4 : దేశంలో ప్రత్యామ్నాయ ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా ఆటోమొబైల్ రంగం వేగంగా అడుగులు వేస్తోంది. పెట్రోల్‌పై ఆధారాన్ని తగ్గించడం, కాలుష్యాన్ని నియంత్రించడం లక్ష్యంగా ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలకు ప్రాధాన్యం పెరుగుతోంది. తాజాగా హీరో మోటోకార్ప్ స్ప్లెండర్ ప్లస్ ఫ్లెక్స్ ఫ్యూయల్, హెచ్‌ఎఫ్ డీలక్స్ ఫ్లెక్స్ ఫ్యూయల్ మోడళ్లను ప్రవేశపెట్టడంతో ఈ సాంకేతికత మరోసారి చర్చనీయాంశంగా మారింది.

భారత్‌లో ఇథనాల్ ఆధారిత ద్విచక్ర వాహనాల ప్రయాణం 2019లో ప్రారంభమైంది. అప్పట్లో టీవీఎస్ మోటార్ కంపెనీ అపాచీ ఆర్‌టీఆర్ 200 ఎఫ్‌ఐ ఈ100 మోడల్‌ను విడుదల చేసింది. వంద శాతం ఇథనాల్‌తో నడిచే తొలి మోటార్‌సైకిల్‌గా అది గుర్తింపు పొందింది.

ఇప్పుడు హీరో మోటోకార్ప్ తీసుకొచ్చిన స్ప్లెండర్ ప్లస్ ఫ్లెక్స్ ఫ్యూయల్, హెచ్‌ఎఫ్ డీలక్స్ ఫ్లెక్స్ ఫ్యూయల్ మోడళ్లు దేశంలోని తొలి భారీ వినియోగదారుల విభాగానికి చెందిన ఫ్లెక్స్ ఫ్యూయల్ బైక్‌లుగా నిలుస్తున్నాయి. ఈ బైక్‌లు ఈ85 వరకు, అంటే 85 శాతం ఇథనాల్ మిశ్రమ ఇంధనంతో పనిచేసేలా రూపొందించబడ్డాయి.

సాధారణ ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ఈ మోడళ్లు దేశవ్యాప్తంగా ఫ్లెక్స్ ఫ్యూయల్ సాంకేతికతను మరింత ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశముందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా స్ప్లెండర్, హెచ్‌ఎఫ్ డీలక్స్ శ్రేణికి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విస్తృత ఆదరణ ఉండటంతో ఈ సాంకేతికత వేగంగా విస్తరించే అవకాశం ఉంది.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405